క్లుప్తంగా

కాకతీయ కమ్మ సత్రానికి విరాళం

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామంలో కాకతీయ కమ్మ సేవా సమితి సారథ్యంలో కోటప్పకొండ తిరునాళ్లలో కాకతీయ కమ్మ సత్రానికి రూ.1, 60,516 అందజేసినట్లు కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ప్రతి ఏటా గ్రామస్తులు సహకారంతో విరాళాలు అందజేయటం ఆనావాయితీగా వస్తుందన్నారు. అదే విధంగా శావల్యాపురానికి చెందిన వారు రూ.17,700 విరాళం అందజేశారు.

వైభవోపేతంగా మన్నేపల్లి తిరునాళ్ల



బొల్లాపల్లి: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని మండలంలోని మన్నేపల్లి తండా సమీపంలోని కొండపై వెలసిన మన్నేపల్లి లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్లు శుక్రవారం వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని పొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మన్నేపల్లి లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం సాయంత్రం అంగరంగవైభవంగా కనుల విందుగా చేశారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి భక్తులు బారీగ తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. భారీ విద్యుత్ ప్రభలు కొలువుతీరాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, భజన, కోలాటాలు భక్తులను అలరించాయి. భక్తుల రాకపోకల సౌకర్యార్థం వినుకొండ, మాచర్ల ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించారు.

రేపు విద్యార్థులతో ఐఆర్ఎస్ అధికారి ముఖాముఖి

నరసరావుపేట ఈస్ట్: సివిల్స్ వంటి పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు ఐఆర్ఎస్ అధికారి ఈదర రవికిరణ్‌తో ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి శుక్రవారం తెలిపారు. పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం ముఖాముఖి ఏర్పాటు చేసినట్లు వివరించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



మృతుడు నాగరాజు

యడ్లపాడు: ఆత్మహత్యకు పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యడ్లపాడు మండలం సొలస గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు కుంభా నాగరాజు తరచు మద్యం తాగుతున్నాడు. మద్యంకు బానిసైతే వివాహం కూడా జరగదంటూ కుటుంబ సభ్యులు అతన్ని గట్టిగా మందలించారు. దీంతో మనస్తాపం చెందిన నాగరాజు గతనెల 26వ తేదీన ఇంట్లో పురుగుల మందు తాగాడు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 7వ తేదీ రాత్రి నాగరాజు(26) మృతి చెందాడు. మృతుడి తల్లి సామ్రాజ్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా మహిళా దినోత్సవం



నూజెండ్ల: స్థానిక గుంటి ఆంజనేయస్వామి దేవస్థానంలోని మండపం వద్ద వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. అనంతరం పలువురు వాసవి వనిత క్లబ్ సభ్యులను సత్కరించారు. నూజెండ్ల జెడ్పీ హెచ్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం సింగంశెట్టి అన్నపూర్ణ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థినులు క్రమశిక్షణతో భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ వంగూరి ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు సన్మానం

నరసరావుపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కోటప్పకొండ వద్ద విధుల్లో ఉన్న మహిళా ఉద్యోగులను డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్ శుక్రవారం సన్మానించారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి, ఏపీఎం కృష్ణవేణి, ఉష, సునీత, మండల సమాఖ్య అధ్యక్షురాలు అనూషలను సన్మానించారు.

క్షతగాత్ర కూలీలకు పరామర్శ

క్రోసూరు: రాయచూరు నుంచి మిర్చి కోతల కూలీ పనులకు మండలంలోని గాదెవారిపాలెం గ్రామానికి వచ్చిన వ్యవసాయ కూలీలు వెళ్తున్న ట్రాక్టర్ గురువారం బోల్తా పడిన ప్రమాదంలో గాయపడిన కూలీలను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శుక్రవారం పరామర్శించారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించిన అనంతరం క్షతగాత్రులందరికీ మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. ఆయన వెంట గాదెవారిపాలెం సర్పంచ్ దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి ఉన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన కోటప్పకొండ

- విద్యుత్ ప్రభలు, మొక్కుబడుల ప్రభలు రాక
- స్వచ్ఛంద సంస్థలు సేవ కార్యక్రమాలు
- సత్రాలను సందర్శించిన ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ అనీల్‌కుమార్

నరసరావుపేట: త్రికోటీశ్వరుని సన్నిధి శివనామస్మరణతో హోరెత్తింది. ఊరూవాడా కదలివచ్చింది. చిన్న పెద్ద తేడా లేకుండా మొక్కులు చెల్లించేందుకు తరలివచ్చారు. కాలిబాటన కొందరు మరొకరు కొందరు చిన్న ప్రభలతోనూ వచ్చారు. అడుగడుగునా శివయ్య ఆదుకోవయ్యంటూ వేడుకున్నారు. కొండ దిగువ, ఎగువ ప్రాంతాలు భక్తులతో నిండిపోయాయి. పరిసర ప్రాంతాల నుంచి సుమారు 20కి పైగా భారీ విద్యుత్ ప్రభలతో పాటు వందలాదిగా సాధారణ తడిక మొక్కుబడి ప్రభలు త్రికోటేశ్వరస్వామి సన్నిధికి తీసుకొచ్చారు. కొండకు సమీపంలోని చిలకలూరిపేట మేజర్ కాలువలో స్నానాలు చేసి మొక్కుబడులను తీర్చుకున్నారు.



కోటప్పకొండ దిగువన మెట్లమార్గం ప్రవేశం వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేస్తున్న భక్తులు

మెట్లమార్గం కిటకిట..

మెట్లమార్గంలోని శ్రీ విఘ్నేశ్వరస్వామి దేవాలయంలో స్వామిని దర్శించుకొని మెట్ల మార్గం ద్వారా వేలాదిమంది భక్తులు కొబ్బరికాయలు కొట్టి మెట్లకు కుంకుమ పూజ చేస్తూ కొండపైకి చేరుకున్నారు. వేలాది మంది మెట్ల మార్గంలో కొండపైకి చేరుకున్నారు. బస్సుల ద్వారా ఘాట్‌రోడ్డు గుండా భక్తులు కొండపైకి చేరుకున్నారు. నరసరావుపేట, చిలకలూరిపేట, కొండకు వెళ్లే జంక్షన్‌లో ఏర్పాటు చేసిన శివుని విగ్రహం ముందు నిలబడి సెల్ఫీలు తీసుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. స్వామి వారిపై పడే విధంగా ఏర్పాటుచేసిన పౌంటేన్ నీటిని భక్తితో తలపై చల్లుకున్నారు.

భక్తుల సేవలో...

భక్తులకు దాహార్తిని తీర్చేందుకు పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, చారిటబుల్ ట్రస్టుల ప్రతినిధులు మజ్జిగ, పులిహోర, వాటర్ బాటిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. రెడ్డి, కమ్మ, కాపు, బ్రాహ్మణ, ఆర్య వైశ్య, యాదవ, వడ్డెర, బొందిలిసింగ్ కులాలతో పాటు సుమారు 20 కులాలకు చెందిన సత్రాల్లో వేలాది మందికి ఉచితంగా అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే భక్తులు, పిల్లలు ఆనందం కోసం ఏర్పాటు చేసిన పెద్ద రంగుల రాట్నం, తోరా.. తోరా, మిక్కీమౌస్ లాంటి వాటిని ఎక్కి పెద్దలు, పిల్లలు పండగను సంతోషంగా గడిపారు.

ఆకట్టుకున్న వివిధ శాఖల స్టాళ్లు

వ్యవసాయం, ఉద్యాన శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, రోడ్డు సేఫ్టీ ఎన్‌జీఓ, హ్యాండ్ ఆఫ్ కంపాషన్ పాటు వివిధ ప్రభుత్వ సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను భక్తులు సందర్శించారు. ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జంక్షన్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసిన పోలీసులు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీగా బందోబస్తు నిర్వహించారు.

కిక్కిరిసిన శైవ క్షేత్రాలు

నాదెండ్ల: అన్ని దారులూ శివాలయాల వైపే.... అనేలా మహాశివరాత్రి సందర్భంగా భక్తులు శివాలయాలకు పోటెత్తారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు శివయ్య దర్శనానికి బారులు తీరారు. గ్రామాల్లోని శివాలయాల్లో పూజలు, అభిషేకాలు జరిగాయి. అనంతరం అన్ని గ్రామాల నుంచి భక్తులు కోటప్పకొండకు తరలివెళ్ళి మొక్కులు తీర్చుకున్నారు.

విద్యుత్ ప్రభలు..

శావల్యాపురం: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మండలంలోని పోట్లూరు, కొత్తలూరు గ్రామాల నుంచి కోటప్పకొండ తిరునాళ్లకు మొక్కుబడి విద్యుత్ ప్రభలు తరలివెళ్లాయి. పురవీధుల్లో ఊరేగించారు.

ఈపూరులో శివరాత్రి పూజలు...

ఈపూరు: మహాశివరాత్రి పర్వదినాన్ని మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఈపూరులోని వీరభద్రాలయంలో, బొమ్మరాజుపల్లి సంజీవకొండ, బొగ్గరం, ముప్పాళ్ల, ఇనిమెళ్ల, కొచ్చర్ల శివాలయాల్లో శివరాత్రి సందర్భంగా ఆ మహాదేవుని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు బారులు తీరి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు.

శావల్యాపురం మండలంలో..

శావల్యాపురం: మండలంలోని కారుమంచి, వేల్పూరు, మతుకుమల్లి, పోట్లూరు, కొత్తలూరు, శావల్యాపురం తదితర గ్రామాల్లో మహాశివరాత్రి పర్వదినం వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహించారు.

చిరుమామిళ్లలో.. పూజలు

నాదెండ్ల: మండలంలోని చిరుమామిళ్లలోని త్రికోటేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ తిరునాళ్లలా చిరుమామిళ్లలో వేడుకలు జరిగాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. కేంద్ర ప్రభుత్వ అధికారి గాదె శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి డైరెక్టర్ గాదె సుజాత, సర్పంచి ఎస్. లక్ష్మి పూజల్లో పాల్గొన్నారు.

కేసానుపల్లిలో రెడ్లబజారు ప్రభ ప్రారంభం

నరసరావుపేట రూరల్: మహా శివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు తీసుకెళ్లేందుకు మండలంలోని కేసానుపల్లి గ్రామంలో 23వ వార్షికోత్సవంగా నిర్మించిన రెడ్ల బజారుప్రభకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే గోపిరెడ్డికి గ్రామ నాయకుడు మారూరి శివారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. ప్రభను కోటప్పకొండకు తరలించారు.



కాపుల అన్నదాన సత్రంలో ఎమ్మెల్యేలు గోపిరెడ్డి, అనిల్‌ను సన్మానిస్తున్న దృశ్యం



కోటప్పకొండ దిగువన నీటితో నింపిన స్విమ్మింగ్‌పూల్‌లో ఆడుకుంటున్న పిల్లలు

సత్రాలను సందర్శించిన డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్

మహా శివరాత్రి పురస్కరించుకొని కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ కొండ దిగువన పలు కులాలకు చెందిన సత్రాలను సందర్శించారు. రెడ్డి, కాపు, ఆర్యవైశ్య, యాదవ, ముదిరాజు, పద్మశాలీ, వడ్డెర, బొందిలీలు, రజకులు, నాయీ బ్రాహ్మణుల సత్రాలను సందర్శించారు. ఆయా సత్రాల కార్యవర్గ ప్రతినిధులు వారిని పూలదండలతో సత్కరించారు. ఆర్య వైశ్య సత్రంలో భోజనం చేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, ముదిరాజు కార్పొరేషన్ డైరెక్టర్ ఈఎం స్వామి, నాగార్జున యూనివర్సిటీ సెనేట్ మాజీ సభ్యుడు మిట్టపల్లి కోటేశ్వరరావు, సీమాంధ్ర డ్రగ్స్ అసోసియేషన్ కార్యదర్శి కేపీ రంగారావు, కామిరెడ్డి నరిసిరెడ్డి, చేగిరెడ్డి ఈశ్వరరెడ్డి, రాయల శ్రీనివాసరావు, ఎస్‌కే ఆంజనేయులు, మత్రిపూడి రాంబాబు, మద్దిరెడ్డి నరసింహారెడ్డి, వంకా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

హరహర మహాదేవ... శంభో శంకర



అల్పాహారం పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు



చౌత్రా సెంటర్ శివాలయంలో మూల విరాట్

చిలకలూరిపేట: హరహర మహాదేవ... శంభో శంకర... చేదుకో కోటయ్యా... మమ్మాదుకో కోటయ్యా... అంటూ చిలకలూరిపేట పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు కోటప్పకొండ తిరునాళ్లకు శుక్రవారం తరలివెళ్లారు. ఉదయం నుంచే కోటప్పకొండకు వెళ్ళే జనసందోహం రోడ్లపై కనిపించింది. మధ్యాహ్నం నుంచి కొండకు వెళ్ళే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆర్టీసీ 120 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో....

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోటప్పకొండకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో అల్పాహార కేంద్రంతో పాటు, మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. దీంతో పాటుగా కాపు,తెలగ,బలిజ, తూర్పుకాపు,ఒంటరి సంక్షేమ సమితి, మల్లెల సత్యానారాయణ మెమోరియల్, సూర్యబలిజ సంక్షేమ సంఘం, శాలివాహన కుమ్మర్ల ప్రజాపతి సంఘంతో పాటు పలు అల్పాహార కేంద్రాలను రాజేష్‌నాయుడు ప్రారంభించారు. రోటరీక్లబ్, లయన్స్ క్లబ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ముదిరాజ్ యువసేన, సీపీటీ సోల్జర్స్, ఆరా ఫౌండేషన్, రజకజన సేవా సంఘం ఇలా పలు సంఘాల ఆధ్వర్యంలో అల్పాహారం, చలివేంద్ర కేంద్రాలు ఏర్పాటు చేశారు.



కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



భక్తులకు ప్రసాదం అందజేస్తున్న దృశ్యం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

జగనన్న జన సునామీ



రావులాపురం ప్రభ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా

- పేదల పార్టీ వైఎస్సార్ సీపీ
- పేదలకు, దొరలకు మధ్య యుద్ధం
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు

బొల్లాపల్లి: వైఎస్సార్ సీపీ పేదలకు అండగా నిలిచిందని, పేదల పార్టీ అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు అన్నారు. మండలంలోని రావులాపురంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మన్నేపల్లయ్య స్వామి తిరునాళ్ల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ నుంచి బొల్లా మాట్లాడారు. గ్రామాలను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. రూ.కోట్ల నిధులు పలు పథకాలు ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతోందని, దివంగత రాజన్న హయాంలో పాలన తలపించే విధంగా జగనన్న పాలన కొనసాగుతోందని గుర్తు చేశారు. సిద్ధం సభలకు తరలి వచ్చే జన సునామీని చూసి ప్రతి పక్ష పార్టీల వెన్నులో వణకు పుడుతుందని పేర్కొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద గిరి ప్రదక్షిణ



వినుకొండ(నూజెండ్ల): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని మంజునాథ ఆలయం, పాత శివాలయం, కామాక్షి కమలేశ్వర ఆలయం, కొండపైన రామలింగేశ్వరస్వామి ఆలయాలతో పాటు రూరల్ పరిధిలోని శైవక్షేత్రాలు భక్తులతో తెల్లవారుజాము నుంచే కిటకిటలాడాయి. హరహర మహదేవా శంభోః శంకర నామస్మరణాలతో ఆలయాలు మార్మోగాయి. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, కోటప్పకొండ, మన్నేపల్లి, త్రిపురాంతకం ప్రాంతాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేయడంతో భక్తులు వేలాదిగా తరలివెళ్లారు. అదేవిధంగా నూజెండ్ల మండలంలోని పలుదేవాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో శ్రీరామలింగేశ్వరస్వామి వేంచేసి ఉన్న కొండ చుట్టూ గిరిప్రదక్షిణ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా కొండమెట్ల వద్ద ఉన్న శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు బి.రవికుమార్ పాల్గొన్నారు.

శైవాలయాల్లో శివరాత్రి సందడి



పాతూరు భీమలింగేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో శివుని విగ్రహం

నరసరావుపేట ఈస్ట్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని శైవాలయాలు భక్తజనులతో కిటకిటలాడాయి. ఉదయం ఆయా ఆలయాలలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. చిన్నారులు మొక్కుబడి ప్రభలతో పాతూరులోని శ్రీభీమలింగేశ్వరస్వామిని దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు. మరికొందరు తమ ప్రభలతో కాలినడకన శ్రీత్రికోటేశ్వరస్వామి దర్శనార్థం కోటప్పకొండ తరలివెళ్లారు. పట్టణం నడిబొడ్డున ఉన్న గరళకంఠుడి విగ్రహం వద్ద భక్తులు పూజలు జరిపారు. శృంగేరి శంకరమఠంలోని శంకర చంద్రమౌళేశ్వరస్వామి, బరంపేటలోని వాయుమల్లేశ్వరస్వామి, రావిపాడురోడ్డు బాలయ్యనగర్‌లోని కళ్యాణసుందరేశ్వరస్వామి, ఎస్ఎస్‌పీ కాలనీ శివాలయాలలో భక్తులు అధిక సంఖ్యలో పూజలు జరిపారు.





చిన్నారుల మొక్కుబడి ప్రభలు

వైఎస్సార్ సీపీతో ప్రతి కుటుంబానికి మేలు

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించి మేలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ మండలంలోని ఏనుగుపాలెం గ్రామంలో కొంకేరు వాగుపై నిర్మించిన నూతన బ్రిడ్జిని ప్రారంభించారు. అదే విధంగా నవరత్నాలు పేదలందరికి ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీ లేఅవుట్ -2ను ప్రారంభించి లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన సయ్యద్ మున్ని గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న జీవీ ఆంజనేయులు నియోజకవర్గ ప్రజలకు చేసిందేమీ లేదని, పదవిని తన స్వార్థానికి వినియోగించుకున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో పెత్తందారులకు పేద ప్రజలకు యుద్ధం జరుగుతుందని, ఆ యుద్ధంలో ప్రజలు మంచి వైపు అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండు చెన్నయ్య, ఎంపీపీ జయశ్రీ వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు విజయలక్ష్మి రాజా, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి పాల్గొన్నారు.



కొంకేరు వాగుపై ఏర్పాటు చేసిన నూతన బ్రిడ్జిని ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా

నాలుగు పూరిళ్లు దగ్ధం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో నాలుగు పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో కాలనీకి చెందిన పులి వెంకటేశ్వర్లు, పులి వెంకటరమణ, పగిడి నారాయణ, పగిడి నాగరాజులకు చెందిన ఇళ్లు కాలిపోయాయి. గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి సమయంలో నిప్పుపెట్టారని బాధితులు ఆరోపిస్తున్నారు.